## ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు




మహబూబాబాద్ ఆర్టీవో కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

మహబూబాబాద్, మే 28 : మహబూబాబాద్ ఆర్టీవో కార్యాలయంలో ఏసీబీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం.. రవాణా శాఖ కార్యాలయాల్లో కొన్నేళ్లుగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయనే సమాచారంతో ఏసీబీ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలతో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, ఎల్ రాజు, ఎస్ రాజు, సిబ్బందితో కలిసి మహబూబాబాద్ ఆర్టీవో కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఆరుగురు ఏజెంట్లు లెర్నింగ్, పర్మినెంట్, ఫిట్‌నెస్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లు నగదుతో ఉన్నట్లు గుర్తించారు.

**ఆరుగురు ఏజెంట్లు, డీటీవో డ్రైవర్ వద్ద నగదు లభ్యం**

అదేవిధంగా డీటీవో గౌస్‌పాషా డ్రైవర్ సుబ్బారావు వద్ద డాక్యుమెంట్లు, రూ.16 వేల నగదు లభ్యం కావడంతో వాటిని సీజ్ చేశారు. తనిఖీల సమయంలో డీటీవో లేడని, అయినప్పటికీ ఈ అక్రమ వసూళ్లకు సంబంధించి ఆయనకు బాధ్యత ఉంటుందని, ఏజెంట్లు, డ్రైవర్, ఎంవీఐలు సాయిచరణ్, సంగెం వెంకటపుల్లయ్యను సైతం విచారిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ వివరించారు. మిగతా వివరాలను ఏసీబీ డీజీపీ సీవీ.ఆనంద్ ఆదేశాల మేరకు మీడియాకు వెల్లడిస్తామన్నారు.

# ఓరుగల్లుకు అవమానం



**ప్రభుత్వ రాజముద్ర నుంచి కాకతీయుల కళాతోరణాన్ని తొలగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఓరుగల్లు ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. కాకతీయ కళాతోరణం, స్వాగత తోరణం, ద్వారతోరణం, విజయ తోరణం, శిలాతోరణ ద్వారం.. ఇలా ఎన్ని పేర్లతో పిలిచినా శిల్పుల గొప్ప కళా నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనం. ఈ తోరణం కేవలం అలంకారం కోసం చేసిన డిజైన్ కాదు.. కాకతీయుల పాలనా వైభవాన్ని చాటిచెప్పే చిహ్నం. ప్రజలు మెచ్చేలా పాలించిన కాకతీయుల స్ఫూర్తిని కొనసాగించేలా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రలో కళాతోరణానికి స్థానం కల్పించారు. కానీ కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయంతో ఓరుగల్లు చారిత్రక ప్రాధాన్యతను తగ్గించి అవమానిస్తున్న తీరు ప్రజలు, చరిత్రకారుల మండిపాటుకు కారణమవుతున్నది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా ప్రజలు మద్దతుగా నిలిచి 12 స్థానాల్లో పది సీట్లు గెలిపించినందుకు కనీస కృతజ్ఞత కూడా లేకుండా చారిత్రక చిహ్నాన్ని మాయం చేయడంపై భగ్గుమంటున్నారు.**

- వరంగల్, మే 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- తొలగింపుపై ప్రజల్లో ఆగ్రహం
- అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓరుగల్లు మద్దతు
- ఇప్పుడు ప్రాధాన్యతను తగ్గించేలా సర్కారు తీరు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చరిత్రకారులు, ప్రజలు

**రాజముద్ర నుంచి కళాతోరణం మాయం**

**కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం**

రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర నుంచి కాకతీయుల కళాతోరణాన్ని తొలగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఓరుగల్లు ప్రజలు మండిపడుతున్నారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా పరిపాలన సాగించిన కాకతీయులకు గుర్తింపుగా కళాతోరణం నిలిచింది. కాకతీయుల కళాతోరణానికి ప్రత్యేకత ఉన్నది. ప్రభుత్వ రాజముద్ర నుంచి దీన్ని తొలగించేలా కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంటుండడంతో ఓరుగల్లుకు ఉన్న ప్రాధాన్యతను పూర్తిగా చెరిపివేసినట్లయ్యింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో పది సీట్లలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన కృతజ్ఞత కూడా లేకుండా ఓరుగల్లుకు ఉన్న చారిత్రక గుర్తింపును మాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఉన్నదని ఓరుగల్లు ప్రజలు భగ్గుమంటున్నారు. తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్ష సాకారమై 2014లో తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడింది. తెలంగాణకు ఉన్న చారిత్రక ప్రత్యేకత, ప్రజలు మెచ్చేలా పరిపాలన సాగించిన కాకతీయుల స్ఫూర్తిని కొనసాగించేలా ఉండేందుకు వీలుగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రలో కళాతోరణానికి స్థానం కల్పించారు. కాకతీయుల కంటే ఓరుగల్లుకు ఉన్న చారిత్రక ప్రాధాన్యతకు గుర్తుగా ఇది నిలిచింది.

**కళా నైపుణ్యానికి నిదర్శనం**

ప్రజలు కేంద్రంగా పరిపాలన సాగించిన కాకతీయులు అనగానే మొదట గుర్తుకొచ్చేది కాకతీయ కీర్తితోరణం. కాకతీయ కళాతోరణం, స్వాగత తోరణం, ద్వారతోరణం, విజయ తోరణం, శిలాతోరణం ద్వారం.. ఇలా ఎన్ని పేర్లతో పిలిచినా కాకతీయ తోరణాలు శిల్పుల గొప్ప కళా నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్నాయి. భారతీయ ఆలయాల నిర్మాణ వాస్తు సంప్రదాయంలో తోరణాల నిర్మాణం క్రీస్తు పూర్వం రెండో శతాబ్దంలో మొదలైంది. తోరణాల నిర్మాణ పద్ధతికి ఆద్యుడిగా శాతవాహన రాజైన శాతకర్ణిని పేర్కొనవచ్చు. అతను సాంచి స్తూపం చుట్టూ నాలుగు దిక్కుల్లో నాలుగు తోరణ ద్వారాలను నిర్మించాడు. ప్రస్తుతం హిందూ దేవాలయాలకు మనం చూస్తున్న తోరణ ద్వారాల నిర్మాణ సంప్రదా యం బౌద్ధ స్తూపాలతో వచ్చింది. కాకతీయుల మొదటి రాజధాని హనుమకొండలో ని పద్మాక్షిగుట్ట వద్ద ఏర్పాటుచేసిన మొదటి దశ తోరణంగా చరిత్రకారులు పరిశోధించారు. 1117వ సంవత్సరంలో దీన్ని ఏర్పాటు చేసినట్లుగా చెబుతారు. ఐనవోలు, కొలనుపాకల్లో ఏర్పాటు చేసిన రెండో దశ తోరణంలో లేని ప్రత్యేకతలు వరంగల్ కోటలో మనకు కనిపిస్తాయి. అనంతరం కాకతీయుల రాజధాని ఓరుగల్లు(ఖిలావరంగల్)కు మారింది. అక్కడ ప్రతిష్ఠించిన కీర్తి తోరణాలు మరింత కళావైభవంతో కనిపిస్తాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో చారిత్రక సంపదకు గుర్తింపు లేకుండా పోతున్నది. సర్కారు నిర్ణయంపై చరిత్రకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# క్రికెట్ నెట్స్‌కు ఫుల్ క్రేజ్



నెట్స్‌లో క్రికెట్ ఆడుతూ..

*ఎక్కువమంది ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. ముఖ్యంగా ఐపీఎల్ సీజన్ నడుస్తున్న వేళ ప్రతి ఒక్కరికీ ఆడాలనే ఆసక్తి ఉంటుంది. అయితే ఆడాలనే ఉత్సాహం ఉన్నా తీరిక లేక కొందరు.. వీలుదొరికినా ఆటస్థలం ఖాళీగా లేక మరికొందరు బ్యాట్ పట్టుకోలేకపోతున్నారు. అలాంటి వారి కోసం ఇప్పుడు క్రికెట్ నెట్స్ అందుబాటులోకి వచ్చాయి. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా రూపుదిద్దుకున్న నెట్ క్రికెట్ గ్రౌండ్స్ ప్రాక్టీస్ చేసేందుకు సౌలభ్యంగా ఉంటున్నాయి. ఇరువైపులా, వెనుక నెట్టింగ్‌తో చేసిన పిచ్‌లో ఎండ వేడి ఉన్నా ఇబ్బంది లేకుండా నిశ్చింతగా ఆడే వీలుండడంతో పాటు రాత్రిపగలూ తేడా లేకుండా మ్యాచ్‌లు ఆడుకోవచ్చు. అభిమానుల క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని వరంగల్ నగరంలో పది వరకు క్రికెట్ నెట్స్ ఏర్పాటుచేయగా పిల్లలు, యువత వాటి వైపు పరుగులు తీస్తుండడంతో ఎక్కడ చూసినా సందడి కనిపిస్తోంది.*

- హనుమకొండ చౌరస్తా, మే 28



హంటర్ రోడ్‌లోని క్రికెట్ నెట్స్

- నగరంలో చాలాచోట్ల అందుబాటులో..
- ప్రాక్టీస్ చేసేందుకు సౌలభ్యం
- గంటకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు చార్జ్
- మ్యాచ్‌లతో చిన్నా, పెద్దా సందడి

మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా క్రికెట్ నెట్స్ పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం నగరంలో క్రికెట్ నెట్స్ సందడి నెలకొంది. సమ్మర్ హాలీడేస్ కావడంతో క్రికెట్ మైదానాలు చాలా బిజీగా కనిపిస్తున్నాయి. దీంతో నగరంలో నూతనంగా వెలుస్తున్న నెట్ క్రికెట్ మైదానాల వైపు క్రికెటర్లు క్రేజీ పెంచుకుంటున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తుండడంతో క్రికెట్ జోష్ బాగా పెరిగింది. చిన్నపిల్లల నుంచి వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ క్రికెట్ ఆడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మైదానాలు ఖాళీ లేకపోవడంతో నెట్ క్రికెట్ గ్రౌండ్స్‌కు పరుగులు తీస్తున్నారు. క్రికెట్ అభిమానుల కోసం నగరంలో సుమారు 10కిపైగా క్రికెట్ నెట్స్ ఉండటం విశేషం. ఇందులో ప్రొఫెషనల్ క్రికెట్ నేర్చుకునే వారికి నెట్ సదుపా యం కలుగుతుంది. ఈ క్రికెట్ నెట్స్‌లో చిన్నపిల్లలే కాదు ప్రతి ఒక్కరూ క్రికెట్ నేర్చుకోవచ్చు. ఇందులో రాత్రి సమయంలో కూడా క్రికెట్ ఆడుకునే సదుపాయం కల్పిస్తున్నారు. బాల్ దూరం వెళ్లకుండా జాలీలతో కంచెలు వేసి ఉంటుంది. ఇందులో జట్లుగా ఏర్పడిన క్రికెట్ అభిమానులు మ్యాచ్‌లు ఆడుతున్నారు. క్రికెట్ అభిమానుల కోసం క్రికెట్ నెట్స్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు, గంటకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ఛార్జ్ చేస్తున్నట్లు హంటర్‌రోడ్‌లోని ది స్ట్రీట్ హనుమకొండ క్రికెట్ నిర్వాహకుడు రాకేశ్‌రెడ్డి తెలిపా రు.

**ప్రాక్టీస్‌కు అనువుగా..**

క్రికెట్ నెట్‌లను బ్యాటర్లు, బౌలర్లు క్రికెట్ మెళకువలను సాధన చేసేందుకు ఉపయోగిస్తారు. ఇరువైపులా, వెనుక నెట్టింగ్ ద్వారా చుట్టబడిన క్రికెట్ పిచ్ కలిగి ఉంటుంది. బౌలింగ్, బ్యాటింగ్‌కు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. బ్యాటర్ షాట్ కొట్టినప్పుడు మైదానం నుంచి వెళ్లకుండా క్రికెట్ బాల్‌ను నెట్‌లు ఆపుతాయి. వారి ప్రాక్టీస్ సమయం ఆదా అవుతుంది. ఫీల్డర్లు లేదా వికెట్ కీపర్ అవసరం ఉండదు. ఎక్కువమంది ప్లేయర్లు ఒకేసారి శిక్షణ పొందేందుకు అనుమతిస్తారు. ప్రత్యేకించి వారికి అనేక లేన్‌లు ఉన్నప్పుడు బౌలింగ్ గ్రీన్‌మ్యాట్ క్రికెట్ నెట్స్‌పై సిక్స్‌లు, ఫోర్లతో క్రికెటర్లు ఫుల్‌జోష్ నింపుతున్నారు.

### బ్యాటింగ్, బౌలింగ్ నేర్చుకోవచ్చు



క్రికెట్ నెట్స్ ద్వారా బ్యాటింగ్, బౌలింగ్ నేర్చుకోవచ్చు. సమ్మర్ హాలీడేస్‌లో గ్రౌండ్స్ ఖాళీగా ఉండటం లేదు. ఎక్కడచూసినా క్రికెట్ ప్లేయర్స్‌తో నిండిపోయి ఉంటున్నాయి. క్రికెట్ అభిమానుల కోసం ఇప్పుడు క్రికెట్ నెట్స్ అందుబాటులోకి వచ్చాయి. చాలామంది ఇప్పుడు మన దగ్గర ఉన్న క్రికెట్ నెట్స్‌కు వెళ్లి ప్రాక్టీస్ చేస్తున్నారు.

– సొల్లు సమిత్‌ప్రియన్, విద్యార్థి

### నెట్ ప్రాక్టీస్ ఎంతో మేలు..



హైదరాబాద్ తరహాలో ఇప్పుడు వరంగల్ నగరంలో కూడా క్రికెట్ నెట్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు చాలామంది నెట్స్ ద్వారా క్రికెట్ నేర్చుకుంటున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా సమయం దొరికినప్పుడల్లా వెళ్లి క్రికెట్ ఆడుతున్నారు. మనం ఎంత కొట్టినా బాల్ అక్కడే ఉంటుంది. అలసిపోం, బ్యాటింగ్, బౌలింగ్ బాగా ప్రాక్టీస్ అవుతుంది.

– జి.తేజ, రెడ్డికాలనీ

# విత్తన అక్రమ నిల్వలపై దాడులు

- రూ.3.67లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు పట్టివేత
- విత్తన షాపు, యజమానుల ఇళ్ల లో గుర్తింపు
- అధిక ధరలకు అమ్మేందుకు నిల్వ చేసినట్లు వెల్లడి
- విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు బహిర్గతం
- వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారుల సంయుక్త తనిఖీలు



వరంగల్ ఏకశిలనగర్‌లో పట్టుకున్న విత్తనాలను ప్రదర్శిస్తున్న వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు

వరంగల్, మే 28 (నమస్తే తెలంగాణ): మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను కృత్రిమ కొరత సృష్టిస్తున్న వరంగల్‌లోని విత్తన దుకాణాలపై వ్యవసాయశాఖ, పోలీస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మేందుకు విత్తన డీలర్లు అక్రమంగా నిల్వ చేసిన రూ.3,67,100 విలువైన పత్తి విత్తన ప్యాకెట్లను పట్టుకుని సీజ్ చేశారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులోని ఓల్డ్ గ్రేన్ మార్కెట్ ప్రాంతంలో రఘురామ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణంలో సరైన బిల్లులు, రికార్డులు చూపకుండా కృత్రిమ కొరత సృష్టించేందుకు అక్రమంగా నిల్వ చేసిన రూ.2,72,160 విలువైన యూఎస్ 7067 అనే బ్రాండ్‌కు చెందిన 315 పత్తి విత్తనాల ప్యాకెట్లను గుర్తించారు. స్థానిక వ్యవసాయ అధికారి విజ్ఞాన్ సమక్షంలో సీజ్ చేసి విచారణ కోసం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ దుకాణం యజమానులు గోనె సుధాకర్, లక్కర్సు పూర్ణచందర్‌గా అధికారులు తెలిపారు. అనంతరం వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఏకశిలనగర్‌లో మేరీ మాత సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణం యజమాని అల్లం విజయభాస్కర్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఆకస్మిక తనిఖీలు చేసి రూ.31,968 విలువైన వివిధ బ్రాండ్లకు చెందిన 37 పత్తి విత్తన ప్యాకెట్లను పట్టుకొని సీజ్ చేశారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులోని సీతారామ కాంప్లెక్స్‌లో ఉన్న మేరీ మాత సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్ దుకాణం యజమాని విజయభాస్కర్‌రెడ్డి కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మేందుకు పత్తి విత్తన ప్యాకెట్లను తన ఇంటి ఆవరణలో అక్రమంగా నిల్వ చేసినట్లు అధికారులు వెల్లడించారు. పట్టుబడిన పత్తి విత్తన ప్యాకెట్లలో యూఎస్ 7067, సదానంద్, సూపర్ బంటి, సీసీహెచ్–369–బీజీ–2, నవనీత్, ఆధ్య, సంకెట్ బ్రాండ్లకు చెందినవి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విచారణ కోసం ఈ విత్తనాలను మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట రామకృష్ణాపురంలోని మహాలక్ష్మి సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణం యజమాని మల్లిపెద్ది దేవకుమార్ ఇంటి ఆవరణలో అక్రమంగా నిల్వ ఉన్న రూ.63,072 విలువైన 73 పత్తి విత్తన ప్యాకెట్లను పట్టుకుని సీజ్ చేశారు. వీటిలో యూఎస్ 7067, నూజివీడు ఆధ్య, నాథ్ సాంకేట్ బ్రాండ్ల విత్తనాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ప్రభుత్వం నిషేదించిన రూ.58వేల విలువైన గడ్డిమందు బాటిళ్లను అక్రమంగా నిల్వ చేయగా సీజ్ చేసినట్లు చెప్పారు. విచారణ కోసం ఈ విత్తనాలు, గడ్డిమందు బాటిళ్లను మామునూరు పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉషాదయాళ్, ఏడీఏ కే నగేశ్, ఏవో విజ్ఞాన్, టాస్క్‌ఫోర్స్ సీఐలు ఎస్ రవికుమార్, రాజు, ఎస్సైలు నిస్సార్‌పాషా, శరత్ పాల్గొన్నారు.

### విత్తన షాపులు కిటకిట



**వరంగల్ నగరంలోని విత్తన షాపులు రైతులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసుకోగా, రోహిణి కార్తె రావడంతో రైతులు పత్తి, మిరప, ఇతర విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈమేరకు ఉమ్మడి జిల్లా నుంచి కొనుగోలు చేసేందుకు వచ్చిన రైతులతో వరంగల్ స్టేషన్ రోడ్డులోని విత్తనాల షాపులు మంగళ వారం రద్దీగా మారాయి.**

వరంగల్ స్టేషన్ రోడ్డులోని విత్తన షాపులో రైతులు